క్లుప్తంగా

జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారిణి


తేజశ్విని


నజీర్

కదిరి అర్బన్: పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో జరుగుతున్న దక్షిణ మండల అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారిణి తేజశ్విని, జిల్లా జట్టు కోచ్‌గా ఆర్డీటీ కోచ్ నజీర్ ఎంపికయ్యారు. ఈ పోటీలు నెల్లూరులో ఈ నెల 24 వరకు జరగనున్నాయి. తేజశ్విని కుడిచేతి మీడియం పేసర్‌గా అండర్–19 జట్టుకు తొలిసారి ఎంపికైంది.

నిరుద్యోగ భృతి చెల్లించాలి


శ్రామిక సర్వే నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం రూరల్: ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగులకు భృతి చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గొల్లపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రామిక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ జేవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న తదితరులు మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాలలో జీవన ప్రమాణాలు పెరగడం కోసం పశుపోషణ కోసం విరివిగా రుణాలను మంజూరు చేయాలన్నారు. పాల డైరీలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ.600 చెల్లించాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మారుతి, సీఐటీయూ మండల కోకన్వీనర్ ఆదినారాయణ, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, నాయకులు లింగమయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి చెక్కు అందిస్తున్న రవినాయక్

కదిరి అర్బన్: తిరుపతిలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న అభిలాష్‌నాయక్ అనే విద్యార్థికి శనివారం హార్ట్ టు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవినాయక్ విద్యుత్ శాఖ ఏఈ స్వప్న సహకారంతో రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. మూడేళ్లుగా ఈ సాయం చేస్తున్నట్లు రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ లక్ష్మీదేవి, హెచ్‌ఎం బాబా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ జయరాజ్ మృతి


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అధికారులు

తలుపుల : మండలంలోని ఓబులరెడ్డిపల్లి వీఆర్‌ఏ జయరాజ్ (71) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రెడ్డిశేఖర్, కలెక్టరేట్ డీటీ క్రాంతికుమార్, ఆర్ఐ శ్రీనివాస్ శనివారం ఓబులరెడ్డిపల్లికి వెళ్లి జయరాజ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ. 25 వేలు అందజేశారు. ఏఎస్ఓ బాస్కర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా టాపర్‌కు సత్కారం


విద్యార్థిని బిందును సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బిందు ఇంటర్మీడియట్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ భీముడు నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థినిని శాలువాతో సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిందు 980 మార్కులు సాధించడంతో వేలూరు ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) లో ఉచిత సీటు, హాస్టల్ వసతి కూడా పొందడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థిని అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సరీ.. నష్టాలతో వర్రీ

- మార్కెట్‌లో తగ్గిన కూరగాయల ధరలు
- మొక్కలు కొనడానికి ముందుకు రాని రైతులు
- నారును నర్సరీల్లోనే వదిలేస్తున్న నిర్వాహకులు

తనకల్లు: ప్రస్తుతం మార్కెట్లో టమటా, వంకాయ, మిరపకాయల ధరలు తగ్గిపోవడంతో రైతులు నష్టాలు చూవిచూస్తున్నారు. సాధారణంగా రైతులకు టమాట, వంగ, బెండ, మిరప తదితర పంటలు సాగు చేయడానికి అవసరమైన నారు (పైరు)ను నర్సరీల్లో కొనుగోలు చేస్తుంటారు. మండలంలో ప్రధానంగా టమాట, వంగ పంటలను సాగు చేస్తారు. అయితే ప్రస్తుతం వాటి ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో నర్సరీల్లో మొక్కలు కొనుగోలు చేయడానికి రైతులు ముందుకు రాకపోవడంతో రూ.లక్షల్లో నష్టపోవాల్సి వస్తోందని నిర్వాహకులు వాపోతున్నారు. మండలంలోని కొక్కంటిక్రాస్‌లో దాదాపు 30 వరకు నర్సరీలున్నాయి.

పడిపోయిన డిమాండ్..

కొక్కంటిక్రాస్‌లోని నర్సరీల్లో ఉన్న పైరు(నారు)ను మండలంతో పాటు నల్లచెరువు, ఎన్‌పీకుంట, అమడగూరు, అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, పీటీఎం, కర్ణాటకలోని చేలూరు, చాకివేలు తదితర ప్రాంతాల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం నర్సరీల్లో టమాట 1000 మొక్కలు రూ. 700–800, వంగ రూ. 500, మిరప రూ. 600లకు విక్రయిస్తున్నారు. ఏటా మే, జూన్ నెలల్లో వర్షాలు పడినప్పుడు మొక్కల కోసం రైతులు పోటీపడేవారు. ఈ ఏడాది మే చివర్లో, జూన్‌లో మండల వ్యాప్తంగా మంచి వర్షాలు పడ్డాయి. అయితే నర్సరీల్లోని మొక్కలు కొనుగోలు చేయడానికి రైతులు మాత్రం ముందుకు రావడం లేదు. దీనికి కారణం మార్కెట్లో టమాట ధరలు తగ్గిపోవడమేనని నర్సరీల యజమానులంటున్నారు.

పంట సాగుకు ముందుకు రాని రైతులు..

ఈ ఏడాది టమాట, వంగ, మిరప, క్యారెట్, బీట్రూట్, బూడిద గుమ్మడి, దోస తదితర పంటలు ధరలు లేకపోవడంతో పొలాల్లోనే వదిలేయాల్సి వచ్చింది. దీంతో వర్షాలు అనుకూలంగా కురుస్తున్నా, భూములు సిద్ధంగా ఉన్నా రైతులు మాత్రం పంటలు సాగు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో నర్సరీల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పైరును అలాగే వదిలేస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కో నర్సరీలో దాదాపు రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షలకు పైగా నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


కొక్కంటిక్రాస్‌లోని ఓ నర్సరీలోని టమాట పైరు

రూ. 2 లక్షలు నష్టపోయా



నాలుగేళ్లుగా కొక్కంటిక్రాస్‌లో కూరగాయల మొక్కల నర్సరీని నిర్వహిస్తున్నా. మొక్కల పెంపకం కోసం రూ. 2 లక్షలు ఖర్చు చేశా. మొక్కలు నాటే సమయం మించిపోతున్నా అడిగేనాథుడే లేడు. దీంతో మొక్కల పెంపకం కోసం ఖర్చు చేసిన రూ. 2 లక్షలు నష్టపోయా.

– మహేశ్వర్‌రెడ్డి, నర్సరీ నిర్వాహకుడు, చీకటిమానిపల్లి

కూలి ఖర్చులూ రావడం లేదు



భూములను లీజుకు తీసుకొని రూ.లక్షలు ఖర్చు చేసి నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టాం. రైతుల మీద నమ్మకంతో వారు కోరే పైరు (నారు)నే పెంచుతున్నాం. మా నర్సరీలో రెండు లక్షల టమాట, వంగ మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. అయితే మార్కెట్లో టమాటకు ధరలు లేకపోవడంతో రైతులు నారు కొనడానికి ముందకు రావడం లేదు. దీంతో కూలి ఖర్చులు కూడా రావడం లేదు.

– రమణ, నర్సరీ నిర్వాహకుడు, కొక్కంటిక్రాస్

విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి

- పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్‌రెడ్డి

ధర్మవరం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగే విస్తృతస్థాయి సమావేశానికి జిల్లాలోని కార్యవర్గ సభ్యులు తరలిరావాలని పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్‌రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీలో అవినీతి, పనుల విషయంలో సర్పంచులను పట్టించుకోకపోవడం, తల్లికి వందనం పథకానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలను అనర్హులుగా ప్రకటించడంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థుల తరలింపు సరికాదు


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసి గిన్నిస్ బుక్ రికార్డు కోసం రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులను యోగాంధ్ర కార్యక్రమానికి తరలించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. శనివారం పట్టణంలో నాయకులు గణేష్ ,పవన్, సాయి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన విద్యార్థులను అర్ధరాత్రి యోగాంధ్ర కార్యక్రమానికి తరలించడం అన్యాయమన్నారు. ఇదే రీతిలో మంత్రులు, ఎమ్మెల్యేల పిల్లలను తరలిస్తారా అని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో కనీస సౌకర్యాల లేక ఇబ్బందులు పడుతున్నారని, వాటి మీద దృష్టిసారించి గిరిజన విద్యార్థులపై ఉన్న చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవుపలికారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని నిరసన

తలుపుల: లక్కసముద్రం పంచాయతీలోని గజ్జలప్పగారిపల్లి గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌ను తొలగించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం చెబుతుంటే ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ పనులు కల్పించడం లేదన్నారు. కేవలం తనకు నచ్చిన వారికి మాత్రమే పనులు కల్పిస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. వెంటనే అతడి అవినీతిపై విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, అంజన్ బాబు, సిద్దయ్య కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

25న బీఎస్ఎన్ఎల్ సేవలపై అవగాహన

పుట్టపర్తి టౌన్: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) వినియోగదారులకు అందిస్తున్న సేవలపై ఈనెల 25వ ఉదయం 11 గంటలకు గూగుల్‌మీట్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు డీఈ ప్రసాద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు గూగుల్ లింక్ https;//meet.google.com/daj-rcez-utt ను సంప్రదించాలని సూచించారు.

పశువుల దాణ పంపిణీ

ధర్మవరం రూరల్: చింతలపల్లి పశువైద్య కేంద్రం వద్ద శనివారం పాడి రైతులకు పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి శేఖర్ మాట్లాడుతు 50 కేజీల బ్యాగు రూ.1,100 కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.555కే రైతులకు అందిస్తున్నామన్నారు. 80 మంది పాడి రైతులకు ఒక్కొక్కరికి 50 కేజీల చొప్పున పశువుల దాణా అందించామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి


అధికారుల తీరుపై మండిపడుతున్న ఎంపీపీ రఫినాయక్

తలుపుల : అధికారులు బాధ్యతగా పనిచేయాలని లేనిపక్షంలో సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ఎంపీపీ రఫినాయక్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని జీవనజ్యోతి సమాఖ్య కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ నసీమా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏదైనా బిల్లులు నమోదు చేయాలంటే తీర్మానాల్లో ఎంపీటీసీల సంతకాలతో పనిలేదని ఎంపీడీఓ తెలపగా వెంటనే మాసంతకాలతో పనిలేనప్పుడు తమకేం పని అంటూ ఎంపీటీసీలు బైకాట్ చేశారు. తర్వాత ఎంపీపీ వారికి నచ్చచెప్పి సమావేశం జరిగేలా చర్యలు చేపట్టారు. మండల గ్రాంట్‌లో ఎంపీటీసీలకు తెలియకుండా ఏపని చేయకూడదని ఎంపీడీఓను కోరారు. ఇప్పటికి నాలుగు సమావేశాల్లో విద్యుత్ సమస్యలు సభ దృష్టికి తెచ్చినా పరిష్కరించిన దాఖలాలు లేవని, అసలు సమావేశానికే రానివారిపై చర్యలులేవా అని ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌లు కోరారు. ఇప్పటికి 19 నెలలైనా ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వలేదని ఎంపీటీసీ వెంకటేష్ పేర్కొన్నారు. వచ్చే సమావేశంలో అన్ని శాఖల అధికారులు వచ్చేలా చూడాలని లేకుంటే తాము గైర్హాజర్ అవుతామని ఎంపీటీసీలు హెచ్చరించారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం


కొక్కంటిక్రాస్‌లో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మక్బూల్ అహమ్మద్

తనకల్లు: అధైర్య పడకండి ...అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. ఇటీవల తిమ్మమ్మమర్రిమాను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లతీఫ్, సోహైల్ కుటుంబ సభ్యులను శనివారం ఆయన మారెప్పగారిపల్లిలో పరామర్శించారు. చిన్న వయస్సులోనే లతీఫ్, సోహైల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. అనంతరం కొక్కంటిక్రాస్, తనకల్లు అనారోగ్యంతో బాధపడుతున్న మురళీయాదవ్, షఫి, తౌఫిక్, శివరాంరెడ్డిని పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు దేశాయి సంజీవురెడ్డి, సమరసింహారెడ్డి, హరినాథ్‌రెడ్డి ఇంటిలో తేనేటి విందు స్వీకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, సర్పంచ్ సురేష్‌రెడ్డి, మహిళా కన్వీనర్ విజయలక్ష్మీ, మైనార్టీ కన్వీనర్ బాబా, కో ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మాజీ సర్పంచ్ పూల నిర్మల, మండల ఉపాధ్యక్షులు ముస్తఫా, మోహన్, కమిటీ సభ్యులు నరేంద్ర, రెడ్డిపీరా, సూరి, బయారెడ్డి, బాబ్జాన్, నాయకులు భక్తవత్సలరెడ్డి, తబ్రేజ్, చాంద్‌బాషా, కొండ్ల సుధాకర్, రెడ్డెప్పరెడ్డి, గౌస్, ఆనంద్‌రెడ్డి, పూల శంకర్, పూల శీనా, లక్ష్మీపతి, డీలర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు


ఎంపీడీఓ కార్యాలయం వద్ద చెత్తను శుభ్రం చేస్తున్న అధికారులు ఉపాధి కూలీలు

బత్తలపల్లి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. స్వచ్ఛమైన ఆరోగ్యం కావాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉప మండల పరిషత్ అధికారి క్రిష్టప్ప, గృహనిర్మాణశాఖ అసిస్టెంట్ ఇంజినీరు విశ్వనాథ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలను అధికారులు, ఉపాధి కూలీలు శుభ్రం చేశారు. మండల ప్రత్యేక అధికారి మురళీధర్, ఎంపీడీఓ బాలక్రిష్ణుడు తదితరులు చెత్తను తొలగించారు. పిచ్చి మొక్కలను తొలగించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ధర్మవరం అర్బన్: ఇంట్లో ఉన్న భార్య, భర్తలపై దాడి చేసి గాయపరచడమే కాకుండా వారిని కులంపేరుతో దూషించిన ముగ్గురిపై టూ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్–3లో నివసిస్తున్న కొడావత్ సుగుణబాయి, భర్త కృష్ణనాయక్‌లు వారికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఆ స్థలం పక్కనే నివసిస్తున్న రామాంజి ఇంటి ముందున్న వేపచెట్టు కొమ్మలు వీరి స్థలంలోకి వచ్చాయి. వేపచెట్టు కొమ్మలు తొలగించుకోవాలని సుగుణబాయి దంపతులు రామాంజిని కోరారు. అయితే వేపచెట్టు తొలగించమని ఏమి చేసుకుంటారో చేసుకో అంటూ వారం రోజుల క్రితం రామాంజి బెదిరించాడు. శనివారం సుగుణబాయి, కృష్ణనాయక్ ఇంటిలో ఉండగా రామాంజి, అతని భార్య చెన్నకృష్ణమ్మ, అత్త లక్ష్మిదేవి ఇంటిలోకి ప్రవేశించి మాతోనే పెట్టుకుంటారా అంటూ కులంపేరుతో దూషించడంతోపాటు భార్య, భర్తను బయటకు లాగి సుగుణబాయి జాకెట్, చీరను చింపి అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు కిందపడేసి కాళ్లు, చేతులతో కొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ రెడ్డప్ప తెలిపారు.

గిరిజన తండాల్లో వసతులు కల్పిస్తాం

గాండ్లపెంట: గిరిజన తండాల్లో అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని పంచాయతీ కార్యదర్శి మానస శనివారం తెలిపారు. మండలంలోని తుమ్మలబైలు పెద్ద తండాలో ధర్తీ అబా అభియాన్ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఈ పథకం కింద తుమ్మలబైలు పెద్ద తండా ఎంపికైందన్నారు. ఇందులో భాగంగా తండాలో అన్ని రకాల వసతులు కల్పిస్తారన్నారు. గ్రామంలో ఇంటింటికీ పింఛన్, రేషన్, పక్కా గృహం తదితర వివరాలను సేకరించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కేసు నమోదు

కదిరి టౌన్: సొంత బావపై దాడి చేసిన బామ్మర్దిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నిజాంవలీ కాలనీలో నివాసం ఉన్న బాబా ఫక్రోద్దీన్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అయితే అతడికి భార్యకు మధ్య మనస్పర్థలతో గొడవలు తలెత్తాయి. ఈక్రమంలో శనివారం ఉదయం బామ్మర్ది ముజాహిద్ బావ ఫక్రోద్దీన్‌పై ఇనుపరాడ్డుతో దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముజాహిద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

శిక్ష అనుభవంతో మార్పు రావాలి


మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం: క్షణకావేశంలో తప్పులు చేసి జైలుకు వచ్చిన ఖైదీల్లో శిక్ష అనుభవంతో మార్పు రావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కోసం తయారుచేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఖైదీలతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పు చేసి జైళ్లకు రావడం వల్ల కుటుంబ గౌరవ మర్యాదలు దెబ్బతినడంతోపాటు ఆర్థికంగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత మార్పు వచ్చి ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదుల బాక్సులో వేయాలన్నారు. వాటిన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, సంతోషి కుమారి, రవిచంద్ర, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పి.ఎల్.వి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కుర్చీకి వినతి

సోమందేపల్లి: తల్లికి వందనం పథకం అర్జీలు ఇవ్వడానికి గడువు పెంచాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి సీపీఐ నాయకులు శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అయితే తహసీల్దర్ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇచ్చి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రాజ్‌గోపాల్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి అనేక ఆంక్షలు విధించిందన్నారు. సమస్యలు తెలుసుకోవడానికి వస్తే అధికారులు అందుబాటులో లేరన్నారు. మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాలస్వామి, నారాయణ స్వామి, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

పేట వేంకటరమణ ఆలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో పేట వేంకటేశ్వరస్వామి

హిందూపురం: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వివిధ అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.అనంతరం స్వామి మూలవిరాట్‌ను పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత పేట వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మంగళ వాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

శనేశ్వరాలయంలో..

పట్టణంలోని డీబీకాలనీ, టీచర్స్‌కాలనీలోని శనేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి తిల తైలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెండి కవచ అభరణాలతో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. జ్యేష్టాదేవి సమేత శనిదేవుడి ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలంకరణలు చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం వందలాది భక్తులు ఆలయం ఎదుట తిల తైలాలతో దీపారాధనలు చేశారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం


కుమ్మరవాండ్లపల్లిలో యోగా చేస్తున్న డీఏఓ సుబ్బారావు, అధికారులు


ధర్మవరంలో యోగాసనాలు చేస్తున్న జడ్జిలు వెంకటేశ్వర్లు, వెంకట హరీష్, కోర్టు సిబ్బంది


పుట్టపర్తిలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీఓ సువర్ణ తదితరులు

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డీఏఓ సుబ్బారావు, ఎంపీడీఓ పోలప్ప, ఇతర అధికారులు హాజరై యోగాసనాలు వేశారు. స్థానిక ఎస్టీఎస్ఎన్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు చేశారు. ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేష్‌బాబు, యోగా అసోసియేషన్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట హరీష్ యోగాసనాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ ఖరీమ్, ప్రధాన కార్యదర్శి డీఎల్ఎన్ మూర్తి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని రిషి విద్యాలయంలో శనివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డీన్‌లు భాస్కర్‌రెడ్డి, రవి, ప్రిన్సిపల్ పీజా,ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగసనాలు వేశారు.

పుట్టపర్తి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తచెరువు జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సయ్యద్‌మౌలా, ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి యోగాసనాలు వేశారు.

పుట్టపర్తి టౌన్: పట్టణ సమీపంలో ఉజ్వల ఫౌండేషన్ సమీపంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ, కమిషనర్ క్రాంతి కుమార్, విద్యార్థులు యోగసనాలు వేశారు. వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

బెస్ట్ యూనివర్సిటీలో యోగా దినోత్సవం....

పుట్టపర్తి టౌన్: బెస్ట్ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు వేశారు. అనంతరం విద్యార్థులకు నిపుణులతో యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డాక్టర్ రాజయోగి భాస్కర్‌నాయుడు, జ్ఞానమూర్తి, ఆర్మిన్ క్రెబ్స్, కార్ల్‌గ్రోత్,రాణీ, వీరకుమార్ హాజరయ్యారు.


ధర్మవరం రిషి విద్యాలయ ఆవరణలో యోగా చేస్తున్న విద్యార్థులు


బెస్ట్ యూనివర్సిటీలో యోగా చేస్తున్న విద్యార్థులు